# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 118 బుధవారం 31, డిసెంబర్ 2025 పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## అసెంబ్లీ, మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను నియమించిన కేసీఆర్



**అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీష్ రావు, సబిత, తలసాని**

**శాసనమండలి ఉపనేతలుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి**

**మండలి విప్‌గా దేశపతి శ్రీనివాస్‌కు బాధ్యతలు**

**అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ కేసీఆర్ కీలక నిర్ణయం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ మరియు శాసన మండలిలో పార్టీ తరపున వ్యవహరించాల్సిన డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను ఖరారు చేస్తూ మంగళవారం ..మిగతా 0లో

## హైదరాబాద్-విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు

**హైవేలపై సంక్రాంతి ట్రాఫిక్ నివారణకు ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష**

**జనవరి 8 నుంచి హైదరాబాద్–విజయవాడ మార్గంలో భారీ రద్దీ అంచనా**

**పండుగ వేళ హైవే లేన్‌లు మూసివేసే పనులు నిలిపివేయాలని ఆదేశం**

**కీలక జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ పోలీసుల మోహరింపు**

**ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా హై విజిబిలిటీ బోర్డుల ఏర్పాటు**



02



# రోడ్లపై చెత్త, గుంతా కనిపించొద్దు..

**12 జోన్లు, 60 సర్కిళ్లుగా 'CURE' పునర్వ్యవస్థీకరణ**

**ఫీల్డ్‌లోకి అధికారులు..**

**సీఎం స్పష్టమైన ఆదేశాలు**

**ప్లాస్టిక్ నిషేధం, EVలకు ప్రోత్సాహం**

**స్మార్ట్ గవర్నెన్స్‌పై సీఎం ఫోకస్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఔటర్ రింగ్ రోడ్డు(Outer Ring Road) లోపల ఉన్న కోర్‌అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియా(CURE)లో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో నగరాన్ని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి(CM Revanth Reddy) వివరించారు. కోర్‌అర్బన్ రీజియన్‌ను మొత్తంగా ప్రక్షాళన చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే ఐదేళ్లకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని హైదరాబాద్ నగర జోనల్ కమిషనర్లను ఆదేశించారు. నగరాన్ని వివిధ జోన్లుగా పునర్వ్యవస్థీకరించిన నేపథ్యంలో కొత్తగా నియమితులైన జోనల్ కమిషనర్లతో ముఖ్యమంత్రి ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ICCC)లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ల(Zonal Commissioners)కు దిశానిర్దేశం చేశారు.

**ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి..**

"రాష్ట్రం మొత్తం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నాం. హైదరాబాద్ నగర పరిపాలన పట్టాలెక్కించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రధానంగా నగరంలో చెత్త నిర్వహణ అత్యంత సంక్లిష్టమైన సమస్య. ఈ సమస్యపై ..మిగతా 0లో

### దేశవ్యాప్తంగా నేడు
## గిగ్ వర్కర్ల సమ్మె..

**స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌పై ప్రభావం..**

**న్యూ ఇయర్ వేడుకలపై ప్రభావం పడే అవకాశం..**

**వినియోగదారులు షాపులకు వెళ్లి కొనుక్కోవడమే బెటర్..**

03



## 'CETs' షెడ్యూల్ విడుదల..

**మే 4 నుంచి CETs ప్రారంభం**

**EAPCETతో షెడ్యూల్‌కు శ్రీకారం**

**ICET, ECET, LAWCET తేదీలు ఖరారు**

**జూన్ 3తో పరీక్షల ముగింపు**

03



## చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నవా?.



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

రేవంత్‌రెడ్డి నాడు ఉద్యమ ద్రోహిలా మారితే.. నేడు జలద్రోహిలా తయారయ్యారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. గోదావరినల్లమలసాగర్ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతులు జారీ చేసినా స్పందించడం లేదని అన్నారు. గోదావరిబనకచర్లతో జల దోపిడీకి ప్రయత్నం చేసిన ఏపీ నష్టాన్ని తగ్గించడం కోసం బనకచర్ల నుంచి నల్లమలసాగర్‌కు మార్చుకుందని ఆరోపించారు. అది బనకచర్ల అయినా నల్లమలసాగర్ అయినా జరిగేది తెలంగాణ జల దోపిడీనే అని వెల్లడించారు. నల్లమలసాగర్ అక్రమ నిర్మాణానికి ..మిగతా 0లో

## అహ్మదాబాద్, చండీగఢ్ స్టడీ టూర్స్ కు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు..

**అహ్మదాబాద్, చండీగఢ్ టూర్స్‌కు జీహెచ్ఎంసీ కార్పొరేటర్స్**

**ఆ టూర్స్‌కి వెళ్ళి ఏం ఒరగబెడతారన్న ప్రశ్న**

**రెండు బ్యాచ్‌లుగా 145 మంది కార్పొరేటర్స్**

**మరో నెల రోజుల్లో పూర్తవుతున్న పదవీ కాలం**

03



### దేశానికి 'మదర్ ఆఫ్ డెమోక్రసీ'..
## నాకు మాత్రం అమ్మే సర్వస్వం

**బంగ్లాదేశ్ మాజీ ప్రధాని ఖలీదా జియా కన్నుమూత**

**తల్లి మృతిపై కుమారుడు తారిఖ్ రెహమాన్ భావోద్వేగ పోస్ట్**

**దేశం కోసం భర్తను, బిడ్డను కోల్పోయిన త్యాగశీలి అని నివాళి**

**నేడు ఢాకాలో ఖలీదా జియా అంత్యక్రియలు**



**ఢాకా, (ప్రజాస్వరం):**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) అధినేత్రి ఖలీదా జియా మృతి పట్ల ఆమె కుమారుడు, పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రెహమాన్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న 80 ఏళ్ల ఖలీదా జియా... ఢాకాలోని ఎవర్‌కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈరోజు ఉదయం 6 గంటలకు తుదిశ్వాస విడిచారు.

తల్లి మరణంపై స్పందిస్తూ తారిఖ్ రెహమాన్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఒక ఉద్వేగభరితమైన పోస్ట్ చేశారు. "నా తల్లి అల్లా పిలుపు మేరకు మనల్ని విడిచి వెళ్లిపోయారు. చాలా మందికి ..మిగతా 0లో



## తెలంగాణలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం...

**తెలంగాణలో 62 డ్రగ్స్ ముఠాలను ఛేదించిన సి.ఐ వింగ్**

**ఏడాది మొత్తంలో 171 మంది నిందితుల అరెస్ట్**

**న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక డ్రైవ్**

**డీజే పార్టీలో డ్రగ్స్ తీసుకున్న 8 మందిని గుర్తించిన ఈగిల్ ఫోర్స్**

**పబ్‌లు, క్లబ్‌లపై కొనసాగుతున్న ఆకస్మిక తనిఖీలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ ఏడాది (2025) రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ (సి.ఐ) విభాగం అందించిన పక్కా సమాచారంతో జరిపిన ఆపరేషన్లలో 62 డ్రగ్స్ ముఠాలను ఛేదించి, 171 మంది నిందితులను అరెస్టు చేశారు. ఈ చర్యలతో డ్రగ్స్ రవాణా వ్యవస్థకు ..మిగతా 0లో

### ఢిల్లీ గగనతలంపై
## సుదర్శన చక్రం..

**శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం**

**ఢిల్లీ గగనతల భద్రతపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు**

**రూ. 5,181 కోట్ల అంచనాతో సుదర్శన చక్రం**

**గగనతల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ప్రత్యేక దృష్టి**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ 89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ ..మిగతా 0లో

## హైదరాబాద్–విజయవాడ హైవేపై
# ట్రాఫిక్ కష్టాలు ఉండకూడదు

- హైవేలపై సంక్రాంతి ట్రాఫిక్ నివారణకు ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష
- జనవరి 8 నుంచి హైదరాబాద్–విజయవాడ మార్గంలో భారీ రద్దీ అంచనా
- పండుగ వేళ హైవే లేన్‌లు మూసివేసే పనులు నిలిపివేయాలని ఆదేశం
- కీలక జంక్షన్లలో భారీగా ట్రాఫిక్ పోలీసుల మోహరింపు
- ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా హై విజిబిలిటీ బోర్డుల ఏర్పాటు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలుగు రాష్ట్రాల ప్రజలకు అతిపెద్ద పండుగైన సంక్రాంతి సమీపిస్తున్న వేళ, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా పండుగ సమయంలో అత్యంత రద్దీగా ఉండే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జనవరి 8వ తేదీ నుంచే హైవేలపై వాహన రద్దీ గణనీయంగా పెరిగే అవకాశముందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు సురక్షితంగా, సజావుగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉండే రోజుల్లో హైవేలపై మరమ్మతులు లేదా ఇతర కారణాలతో లేన్‌లను మూసివేసే పనులను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. వాహనాల రాకపోకలకు అన్ని లేన్‌లు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ జామ్‌లను నివారించేందుకు కీలకమైన ప్రాంతాల్లో, జంక్షన్ల వద్ద అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలని మంత్రి ఆదేశించారు. అలాగే, ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం ఇచ్చేలా సైన్ బోర్డులు, రాత్రి వేళల్లో కనిపించేలా హై విజిబిలిటీ బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు సంతోషంగా పండుగను జరుపుకునేలా, వారి ప్రయాణం సాఫీగా సాగేందుకు ప్రభుత్వం పూర్తి బాధ్యతతో పనిచేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు.

## అసెంబ్లీ, మండలిలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను నియమించిన కేసీఆర్

**మొదటిపేజీ తరువాయి**

ఉత్తర్వులు జారీ చేశారు.

అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కేసీఆర్ నియమించారు.

అలాగే, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు. మండలిలో పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఉభయ సభల్లో పార్టీ వ్యూహాన్ని సమర్థవంతంగా



అమలు చేసేందుకు కేసీఆర్ ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## తెలంగాణలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం...

**మొదటిపేజీ తరువాయి**

గట్టి దెబ్బ తగిలినట్లయింది.

సి.ఐ విభాగం నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం ఆధారంగా, వివిధ ఏజెన్సీలతో కలిసి పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ఈ దాడులు నిర్వహించారు. అరెస్టయిన వారిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిసింది. 2025 సంవత్సరం పొడవునా ఈ ఆపరేషన్లు కొనసాగినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లో పోలీసులు డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ), ఈగిల్ ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు నగరంలోని పబ్‌లు, క్లబ్‌లు, బార్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందుకోసం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇటీవల సైబరాబాద్ పోలీసులు, ఈగిల్ ఫోర్స్ సంయుక్తంగా ఒక డీజే పార్టీపై జరిపిన దాడిలో డ్రగ్స్ తీసుకున్న 8 మందిని గుర్తించారు. వీరంతా ఇప్పటికే పోలీసుల అనుమానితుల జాబితాలో ఉన్నవారేనని అధికారులు తెలిపారు. అలాగే, డిసెంబర్ 27, 28 తేదీల్లో హెచ్‌న్యూ బృందాలు నిర్వహించిన తనిఖీల్లో 65 మందిని స్క్రీన్ చేయగా, ఒకరు గంజాయి తీసుకున్నట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది.డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడిన వారికి శిక్ష విధించడం కంటే, వారి తల్లిదండ్రులకు సమాచారమిచ్చి కౌన్సెలింగ్, పునరావాసం కల్పించడమే తమ లక్ష్యమని పోలీసులు వెల్లడించారు. న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరిగేలా ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.



# రోడ్లపై చెత్త, గుంతా రెండూ కనిపించొద్దు..

**మొదటిపేజీ తరువాయి**

జోనల్ కమిషనర్లు తమ పరిధిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చెత్త నిర్వహణతో పాటు జోన్ల వారీగా ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్లదే. జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిందే. నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దశల వారీగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి. చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలి. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి నగరాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

**ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదు..**

నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదు. అలాగే రోడ్లపై గుంతలు కనిపించొద్దు. ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలి. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై వీలయినంత తొందరగా స్పందించాలి. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రభలకుండా చర్యలు చేపట్టాలి. కోర్‌అర్బన్ ఏరియాలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకురావాలని నిర్ణయించాం. నగరంలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నాం.

**సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి**

ప్రజలకు ముఖ్యంగా జనన మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువ పత్రాల జారీ విషయంలో ఎలాంటి లోటుపాట్లు జరక్కుండా, ఇబ్బందులు కలగకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. ఆన్‌లైన్ సేవల ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందించాలి. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లతో అనుసంధానం ఉండేలా కమ్యూనికేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలి. హైడ్రా (HYDRAA), జీహెచ్‌ఎంసీ (GHMC), వాటర్ వర్క్స్ (HMWSSB) విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి మొదలు పెట్టాలి. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలి. కోర్ అర్బన్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారు. అందరూ కలిసి పనిచేస్తేనే నగర భవిష్యత్తు బాగుంటుంది..” అని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నవా?.

**మొదటిపేజీ తరువాయి**

సూత్రధారి చంద్రబాబు అయితే.. పాత్రధారి రేవంత్‌రెడ్డి అని దుయ్యబట్టారు. కత్తి చంద్రబాబుది అయినా పొడిచేవాడు రేవంత్‌రెడ్డి అని పేర్కొన్నారు. రేవంత్ చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లిస్తున్నరా అని ప్రశ్నించారు.

బనకచర్లపై తాము పోరాడుతున్న సమయంలోనే ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణతో మీటింగ్ పెట్టిందని చెప్పారు. ఆ సమావేశానికి పోను పోను అంటూనే సీఎం ఉరికారని.. అపెక్స్ మీటింగ్‌కు కాకుండా వేరే ఏ రకమైన సమావేశానికి హాజరు కావొద్దని తాము ఆనాడు గట్టిగా హెచ్చరించామని చెప్పారు. పోను అనుకుంటూనే పోయి కూసున్నరని.. పెట్టపెట్ట అనుకుంటనే సంతకం పెట్టారని ఆరోపించారు. తాము నిలదీస్తే, నిలబెట్టి కడిగేస్తే బనకచర్ల మీటింగ్ ఎజెండాలోనే లేదని, చర్చ జరిగే ప్రసక్తే లేదని డైలాగులు దంచారని తెలిపారు. తాము మీటింగ్ ఎజెండాను బట్టబయటు చేశామని.. ఏపీ ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు సైతం బండారం బయట పెట్టారని పేర్కొన్నారు. బనకచర్లపై చర్చ జరిగిందని, ప్రాజెక్టు నిర్మాణాన్ని సుసాధ్యం చేసేందుకు కమిటీ ఏర్పాటు అయ్యిందని మీడియా ముఖంగా చెప్పారని అన్నారు. బనకచర్లను బంద్ పెడుతున్నమని పేరుకు ఏపీ ప్రకటించిందన్నారు.

**ఇతర రాష్ట్రాలు అభ్యంతరం తెలిపినా..**

పోలవరం నుంచి బనకచర్లలో కలపకుండా, పోలవరం నల్లమలసాగర్‌కు లింకు చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. ఎందుకంటే.. గోదావరి నీళ్లు కృష్ణా ద్వారా తరలిస్తే గోదావరి అవార్డు ప్రకారం 45:21:14 తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు కృష్ణాలో నీటి వాటా ఇవ్వాల్సి ఉంటుందని.. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు విషయంలోనూ ఈ రూల్ వర్తిస్తుందని అన్నారు. ఈ విధంగా కూడా తెలంగాణకు నీటి వాటా దక్కకుండా ఉండేందుకు కృష్ణాలో కలుపకుండానే, పెన్నా బేసిన్‌కు గోదావరి నీటిని తరలించే పెద్ద కుట్రకు తెరతీశారని ఆరోపించారు. నిజానికి పోలవరంబనకచర్ల విషయంలో కర్ణాటక, మహారాష్ట్రలు తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాశాయని.. ఇంటర్ స్టేట్ అగ్రిమెంట్ ప్రకారం గోదావరి నీళ్లు తరలిస్తే.. మరుసటి రోజు నుంచి పైన నీళ్లు ఆపుతామన్నారని తెలిపారు. వరద జలాల మీద ప్రాజెక్టు కట్టేందుకు ఏపీకి అవకాశం ఇస్తే తాము ప్రాజెక్టులు కట్టేందుకు డీపీఆర్‌లు పంపుతామని బలంగా చెప్పారని వెల్లడించారు. అలాగే.. కృష్ణాలో 74 టీఎంసీలు తమ వాటా నీళ్లు ఆపుకుంటామని, వరద ప్రాజెక్టులు కడుతామని, విదర్భకు నీళ్లు తీసుకుపోతామన్నారని తెలిపారు. గంపగుత్తగా నీళ్లు తరలించేందుకు పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టుకు భారీ స్కెచ్ వేసినా ఈ ప్లాన్ కర్ణాటక, మహారాష్ట్రకు అర్థం అయ్యిందని.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం అర్థం కాలేదని అన్నారు.


**నల్లమలసాగర్ సూత్రధారి ఆదిత్యానాథ్**

ఢిల్లీ మీటింగ్‌కు పోను అంటూనే.. చర్చే లేదంటూనే.. కమిటీ కూడా లేదని రేవంత్ అన్నారని.. ఇప్పుడేమో కమిటీ వేశారని హరీశ్‌రావు ఆరోపించారు. ఏపీ కమిటీ వేస్తే, రేవంత్ కూడా కమిటీ వేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పేర్లు కూడా సూచించారని.. డిసెంబర్ 15న చంద్రబాబు కమిటీ వస్తే, 23న రేవంత్ వేశారని పేర్కొన్నారు. ఆ కమిటీలో చంద్రబాబు దాసుడు, చంద్రబాబు సూచించిన ఆదిత్యానాథ్ దాస్ పేరు సూచించారని ఆరోపించారు. దోపిడీదారుల ఏజెంట్, ఏపీకి నమ్మిన బంటు, ఇప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడుగా ఉన్నాడని.. అడుగడుగునా తెలంగాణ ఆకాంక్షలకు, నీటి హక్కులకు అడ్డుపడ్డ సైంధవుడు ఆయన అని పేర్కొన్నారు. తెలంగాణ నీళ్లు తెలంగాణకు దక్కకుండా ఎట్లా చేయవచ్చో ఆంధ్రా ప్రభుత్వానికి నేర్పించిందే ఆయన అని వెల్లడించారు. రాయలసీమ ఎత్తిపోతల పనులను ఏపీ వేగంగా పూర్తిచేసేందుకు తోడ్పాటు అందించింది కూడా ఈయనేనని గుర్తుచేశారు. పోలవరం బనకచర్ల, పోలవరం నల్లమలసాగర్ లింకు ప్రాజెక్టులకు తెరవెనుక సూత్రధారి ఆయనే అని అన్నారు. చంద్రబాబు ఆదేశాలతోనే రేవంత్ ఈ ఆదిత్యానాథ్‌దాస్‌ను నీటి పారుదల శాఖ సలహాదారుగా నియమించుకున్నారని ఆరోపించారు. కమిటీనే వేయొద్దంటే, కమిటీ వేసి ఆదిత్యానాథ్ చైర్మన్‌ను చేశారని.. దొంగ చేతికి తాళం ఇచ్చారని అన్నారు. రేవంత్ కోవర్టు అనడానికి ఇంతకంటే సాక్ష్యం ఏం కావాలన్నారు.

**టెండర్లు ముగిశాక కోర్టుకు..**

ఏపీ ప్రభుత్వం డిసెంబర్ 11 చివరి తేదీతో టెండర్ వేస్తే, అది అయిపోయాక తెలంగాణ ప్రభుత్వం 16న కోర్టుకు వెళ్లిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ కేసును నీరు కార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 23న కమిటీ వేసిందన్నారు. కేసు వేసినప్పుడు కోర్టులో తేల్చుకోకుండా కమిటీ ఎందుకు, చర్చలెందుకు, అందులో ఆదిత్యానాథ్ దాస్ ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిటీలో ముగ్గురు ఆంధ్రా మూలాలు ఉన్న వాళ్లను పెట్టారని అన్నారు. ఏపీ జలదోపిడీ సాగాలె, తెలంగాణ నిండా మునగాలె అనేదే సీఎం లక్ష్యమన్నారు. గోదావరిబనకచర్లకు అత్యంత కీలకమైన అనుమతి రానే వచ్చిందని.. ఈ ప్రభుత్వానికి సోయి లేక మొద్దు నిద్ర నటిస్తున్నదని అన్నారు. అసలు అనుమతి వచ్చిన విషయం ఈ ప్రభుత్వానికి తెలుసా లేదా అని ప్రశ్నించారు. ఢిల్లీ మీటింగ్ అయిన 15 రోజులకే బనకచర్లకు అనుమతి వచ్చిందన్నారు. ఆ మీటింగ్‌లో అంగీకరించారు కాబట్టే పర్మిషన్ వచ్చిందన్నారు. కమిటీ వేయొద్దని.. ఆదిత్యానాథ్ దాస్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి నోరు పారేసుకోవడం తప్ప చేసేదేం లేదన్నారు. అసెంబ్లీలో చిల్లర ప్రసంగం మాని గోదావరి నల్లమలసాగర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి కదలాలని.. సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నా చేద్దామని.. బీఆర్ఎస్ కలిసి వస్తుందని చెప్పారు.





## దేశానికి 'మదర్ ఆఫ్ డెమోక్రసీ'.. నాకు మాత్రం అమ్మే సర్వస్వం

**మొదటిపేజీ తరువాయి**

ఆమె 'ప్రజాస్వామ్య మాత' (మదర్ ఆఫ్ డెమోక్రసీ), రాజీపడని నాయకురాలు. కానీ, నాకు మాత్రం ఆమె దేశం కోసమే జీవితాన్ని అంకితం చేసిన ప్రేమగల అమ్మ" అని పేర్కొన్నారు. కష్టకాలంలోనూ ఆమె కుటుంబానికి అండగా నిలిచారని తారిఖ్ గుర్తుచేసుకున్నారు. దేశం కోసం తన భర్తను, బిడ్డను కోల్పోయినప్పటికీ... దేశ ప్రజలనే తన కుటుంబంగా భావించారని, ఆమె త్యాగాలు బంగ్లాదేశ్ ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని నివాళులర్పించారు.

ఖలీదా జియా మృతికి సంతాపంగా బీఎన్‌పీ 7 రోజుల సంతాప దినాలను ప్రకటించగా, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం 3 రోజుల అధికారిక సంతాపం, బుధవారం సాధారణ సెలవు ప్రకటించింది. రేపు ఢాకాలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో తారిఖ్ రెహమాన్ అధ్యక్షతన పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై సీనియర్ నేతలతో చర్చించారు.





## ఢిల్లీ గగనతలంపై సుదర్శన చక్రం..

**మొదటిపేజీ తరువాయి**

వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది.

ఈ గగనతల రక్షణ వ్యవస్థను ‘సుదర్శన చక్ర - ఫర్ ఢిల్లీ’ అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ ‘సుదర్శన చక్ర’ వ్యవస్థ గురించి ప్రస్తావించారు. దేశంలోని వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, పౌర కేంద్రాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాలను గగనతల దాడుల నుంచి రక్షించేలా బహుళ అంచెల రక్షణ కవచాన్ని ఏర్పాటు చేయడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యమని అప్పుడే ప్రకటించారు. ఈ వ్యవస్థలో భాగంగా శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలను గుర్తించే అధునాతన రాడార్ వ్యవస్థలు, వాటిని మధ్యలోనే కూల్చివేసే ఇంటర్‌సెప్టర్లు, అలాగే సైబర్ యుద్ధాన్ని ఎదుర్కొనే సామర్థ్యం కూడా ఉండనుంది. డీఆర్‌డీవో, ప్రైవేట్ రక్షణ సంస్థలు, భారత సైన్యం కలిసి ఈ భారీ ప్రాజెక్ట్‌ను అమలు చేయడానికి ఇప్పటికే ప్రాథమిక సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. మొత్తంగా చూస్తే, ఢిల్లీ గగనతల భద్రతను ఇనుమడింపజేసే దిశగా సుదర్శన చక్ర ప్రాజెక్ట్ దేశ రక్షణ రంగంలో మరో కీలక మైలురాయిగా నిలవనుందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.






# ‘CETs’ షెడ్యూల్ విడుదల..

- **మే 4 నుంచి CETs ప్రారంభం**
- **EAPCETతో షెడ్యూల్‌కు శ్రీకారం**
- **ICET, ECET, LAWCET తేదీలు ఖరారు**
- **జూన్ 3తో పరీక్షల ముగింపు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత చదువుల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు కీలక సమాచారాన్ని అందిస్తూ, 202627 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఉమ్మడి ప్రవేశ పరీక్షల (CETs) షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి అధికారికంగా ప్రకటించింది. ఈ తాజా ప్రకటన ప్రకారం, మే 4వ తేదీ నుండి జూన్ 3వ తేదీ వరకు నెల రోజుల పాటు వివిధ వృత్తి విద్యా కోర్సుల ప్రవేశ పరీక్షలు విడతల వారీగా జరగనున్నాయి. ఈ విద్యా సందడికి అత్యంత కీలకమైన TG EAPCET (ఎప్‌సెట్) తో శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా మే 4, 5 తేదీల్లో అగ్రికల్చర్ , ఫార్మసీ విభాగాలకు పరీక్షలు నిర్వహించగా, మే 9, 10 , 11 తేదీల్లో ఇంజనీరింగ్ స్ట్రీమ్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. ఇది ముగిసిన వెంటనే మే 12న బి.ఎడ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఉద్దేశించిన TG EDCET పరీక్షను నిర్వహించనున్నారు. వ్యాపార , సాంకేతిక నిర్వహణ రంగాల్లో రాణించాలనుకునే విద్యార్థుల కోసం నిర్వహించే TG ICET (ఎంబీఏ, ఎంసీఏ) పరీక్షలు మే 13, 14 తేదీల్లో జరగనున్నాయి. పాలిటెక్నిక్ పూర్తి చేసి నేరుగా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరాలనుకునే లాటరల్ ఎంట్రీ విద్యార్థుల కోసం TG ECETను మే 15న నిర్వహించనున్నారు. న్యాయ విద్యపై ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం మే 18వ తేదీన TG LAWCET , TG PGLCET పరీక్షలను ఖరారు చేశారు.

ఇక ఉన్నత స్థాయి సాంకేతిక విద్య అయిన ఎంటెక్ , ఎం.ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే TG PGECET పరీక్షలు మే 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు సాగనున్నాయి. ఈ ప్రవేశ పరీక్షల పరంపర చివరగా వ్యాయామ విద్య కోర్సుల కోసం నిర్వహించే TG PECET తో మే 31 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనున్న పరీక్షలతో ముగియనుంది. ఉన్నత విద్యా మండలి ప్రకటించిన ఈ సమగ్ర షెడ్యూల్ ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకునే అవకాశం కలిగింది.




# నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగవాణి రద్దు

**వలిగొండ డిసెంబర్ 30(ప్రజాస్వరం):**

నూతన సంవత్సరం సందర్భంగా గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగవాణి రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. తేది:01.01.2026న నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి వివిధ ప్రాంతాల నుండి ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ఇతర ప్రజలు కలెక్టర్ కార్యాలయానికి రావడం జరుగుతుందని కావున గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్, ఉద్యోగవాణి రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడొక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని ప్రజలు ఈ విషయాన్ని గమనించి గురువారం ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు రావద్దని తెలిపారు.



# జబ్బుల బారిన విద్యార్థులు.. హెల్త్ క్యాంపులు పెట్టాలి: కుతుబ్

**ముక్తల్ ప్రతినిధి డిసెంబర్ 30(ప్రజాస్వరం):**

వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల విద్యాసంస్థలు హాస్టల్లో ఉంటున్న విద్యార్థులు పలు రకాల జబ్బుల బారిన పడుతున్నారని హెల్త్ క్యాంపులో ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి కుటుం డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల కేంద్రంలో ఎస్సీ బీసీ ప్రభుత్వ హాస్టల్లను సందర్శించు మాట్లాడుతూ ఈ ఏడాది అధిక వర్షాలు, అధికచలి, అధికమంచు వాతావరణం ఏర్పడిందన్నారు. హాస్టల్లో వాతావరణ కూడా పరిశుభ్రంగా లేదని దోమలు కూడా ఉన్నాయన్నారు. విద్యార్థులు జలుబు దగ్గు డెంగ్యూ మలేరియా తదితర జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో అమరచింత లో డెంగు వ్యాధితో విద్యార్థి మరణించారని గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాలలు కళాశాలలు హాస్టల్లో సీజనల్ వ్యాధుల కు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి వైద్యం అందించాలన్నారు. లేదంటే ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు హాస్టల్లో వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ నేతలు క్రాంతి రాజు విజయ్ తదితరులు పాల్గొన్నారు.




# దేశవ్యాప్తంగా నేడు గిగ్ వర్కర్ల సమ్మె..

- **స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌పై ప్రభావం..**
- **న్యూ ఇయర్ వేడుకలపై ప్రభావం పడే అవకాశం..**
- **వినియోగదారులు షాపులకు వెళ్లి కొనుక్కోవడమే బెటర్..**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

దేశవ్యాప్తంగా డిసెంబర్ 31న గిగ్ వర్కర్లు సమ్మె చేస్తున్నారు. జొమాటో, స్విగ్గీ, బ్లింకిట్, జెప్టో, అమెజాన్, ఫ్లిప్ కార్ట్‌లకు చెందిన గిగ్ వర్కర్లు సమ్మెలోకి వెళ్తుండటంతో, న్యూ ఇయర్ వేడుకలపై ప్రభావం పడనుంది. ఏడాదిలో అత్యంత అమ్మకాలు జరిగే ఈ రోజే వర్కర్లు స్ట్రైక్ చేస్తుండటంతో కస్టమర్ల ప్రణాళికలు దెబ్బతినే అవకాశం ఉంది. ఇయర్ ఎండ్ రెవెన్యూ టార్గెట్లను చేరుకోవడానికి డిసెంబర్ 31 డెలివరీలపై ఆధారపడే రిటైలర్లను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

**సమ్మె ఎందుకు..?**

తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (TGPWU) మరియు ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్‌బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (IFAT) ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలలో కొన్ని యూనియన్లు కూడా దీనికి మద్దతు ఇచ్చాయి. పని గంటలు పెరుగుతున్నప్పటికీ, ఆదాయం క్రమంగా తగ్గుతోందని కార్మికులు చెబుతున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రమాద బీమా, గౌరవం, భద్రత లేకపోవడం వంటి ప్రధాన ఆరోపణలు చేస్తున్నారు. భారత డిజిటల్ మార్కెట్‌కు వెన్నెముకగా నిలిచే డెలివరీ భాగస్వాములకు కంపెనీలు తగని ప్రాధాన్యత కల్పించడం లేదని వారు ఆరోపిస్తున్నారు.

**న్యూ ఇయర్ వేడుకలపై ప్రభావం:**

గిర్ వర్కర్లు సమ్మెలో ఉండటంతో స్విగ్గీ, జొమాటో, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్ వంటి ఆన్‌లైన్ డెలివరీ ప్లాట్‌ఫారమ్స్‌పై తీవ్ర ప్రభావం పడుతుంది. వినియోగదారులు డెలివరీలు అందుకోలేకపోవచ్చు. గ్రాసరీ, ఫుడ్ డెలివరీలు దెబ్బతింటాయి. ఫుడ్ ఆర్డర్లు ఆలస్యం కావడం లేదా రద్దు కావడం వంటివి జరగొచ్చు. ఢిల్లీ, ముంబై, బెంగళూర్, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా, పూణే వంటి మెట్రో నగరాలతో పాటు టైర్2 నగరాలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది.




**వినియోగదారులు ఏం చేయాలి.?**

కొత్త సంవత్సర వేడుకల ముందు డెలివరీ ప్లాట్‌ఫారమ్స్ ప్రమోషనల్ ఆఫర్స్‌ను అమలు చేస్తున్నాయి. కస్టమర్లు తమ ఉత్పత్తుల్ని నిల్వ చేసుకోవాలని సలహా ఇస్తున్నాయి. న్యూ ఇయర్ వేడుకలతో పాటు ఇతర అవసరాల కోసం వినియోగదారులు దగ్గర్లో ఉండే దుకాణాలను ఆశ్రయించడం బెటర్. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా అర్ధరాత్రి వరకు డైనమిక్ లేదా సర్జ్ ధరలకు కస్టమర్లు సిద్ధంగా ఉండాల్సి రావచ్చు. గతంలో కన్నా డిసెంబర్ 31 రోజున డెలివరీ సమయం మరింత పెరిగే ఛాన్స్ ఉంది. అత్యవసర వస్తువుల కోసం క్విక్ కామర్స్ యాప్‌లపై ఆధారపడకపోవడమే మంచిది.



# అనన్య క్రియేషన్ వారి నూతన సినిమాని ప్రారంభించిన జనసేన నాయకులు ప్రేమ కుమార్


**కూకట్ పల్లి, డిసెంబర్ 30(ప్రజాస్వరం):**

కూకట్ పల్లి నియోజకవర్గం హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోని గోపాల్ నగర్ లో అనన్య క్రియేషన్ వారి నూతన సినిమాని భద్రం సీ కేర్ఫుల్ బ్రదర్ అనే నూతన సినిమా సూటింగ్ ను కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మంగళవారం క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సినిమాలో హీరోగా నటిస్తున జనసైనికుడు నరేష్ రాయల్ ను, దర్శకుడు జక్కన్నను మరియు సినీ బృందాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలపై ఆశ పెట్టు కోకుండా అందరూ కలసి స్వయం ఉపాధిగా కలిసి నిర్మించిన సందేశాత్మక చిత్రాలను ప్రజలు ఆదరించాలని కోరుకుంటని, ముఖ్యంగా ఈ సినిమాలో జనసైనికుడు హీరో గా నరేష్ రాయల్ నటించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సంవత్సర కాలపట్టిక ఆవిష్కరణ

**కూకట్ పల్లి, డిసెంబర్ 30 (ప్రజాస్వరం)**

నూతన సంవత్సరం ప్రజలందరికీ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలను తీసుకురావాలని, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని భగవంతుని కోరుకుంటున్నట్లు టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం గాయత్రి నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సుంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన సంవత్సర క్యాలెండర్ ను బండి రమేష్, టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. కాలనీ సంక్షేమ సంఘాలు స్థానిక సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్,కనకరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రి భువనగిరి కొత్త ఎస్పీగా అక్షాంశ్ యాదవ్ బాధ్యతలు

**యాదాద్రి భువనగిరి డిసెంబర్ 30(ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు మంగళవారం అక్షాంశ్ యాదవ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాచకొండ కమిషనరేట్‌లో డీసీపీగా విధులు నిర్వహించిన ఆయన, జిల్లా ప్రత్యేకంగా ఏర్పాటైన నేపథ్యంలో ఎస్పీగా నియమితులయ్యారు.




# అహ్మదాబాద్, చండీగఢ్ స్టడీ టూర్స్‌కు జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు..

- **అహ్మదాబాద్, చండీగఢ్ టూర్స్‌కు జీహెచ్ఎంసీ కార్పొరేటర్స్**
- **ఆ టూర్స్‌కి వెళ్లి ఏం ఒరగబెడతారన్న ప్రశ్న**
- **రెండు బ్యాచ్‌లుగా 145 మంది కార్పొరేటర్స్**
- **మరో నెల రోజుల్లో పూర్తవుతున్న పదవీ కాలం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

జనం సొమ్ముతో జల్సాలు చేయడమంటే జీహెచ్ఎంసీ కార్పొరేటర్స్‌కు మహా సరదానా? ముక్కు పిండి వసూలు చేసే పన్నుల డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు చేయడానికి పోటీలు పడుతున్నారా? ఇంకో 40 రోజుల్లో పదవి నుంచి దిగిపోయే కార్పొరేటర్స్ ఏం వెలగబెడదామని, ఎవర్ని ఉద్ధరిద్దామని స్టడీ టూర్స్ వేయబోతున్నారు? అవి స్టడీ టూర్సా? లేక ఫైనల్ స్టేజ్‌లో వేసే జాలీ ట్రిప్పా? లెట్స్ వాచ్. గ్రేటర్ హైదరాబాద్‌లో మరో స్టడీ టూర్‌కు రంగం సిద్ధమవుతోంది. జనవరి నాలుగు నుంచి తొమ్మిది మధ్యన రెండు బ్యాచ్‌లుగా కార్పొరేటర్స్ అహ్మదాబాద్, చండీగఢ్‌లో పర్యటించబోతున్నారు. ఇదంతా ప్యూర్‌లీ అఫీషియల్. ఇక చండీగఢ్ వెళ్ళే బ్యాచ్ అనఫిషియల్‌గా కులు మనాలి వెళ్ళి స్వామి కార్యం, స్వకార్యం నెరవేర్చుకుంటారట. ఇక్కడే ఒక మౌలికమైన ప్రశ్న వస్తోంది చాలామందికి. స్టడీ టూర్స్ పేరుతో వీళ్లంతా వెళ్లి, జనం సొమ్ము ఖర్చుపెట్టి వచ్చి అంతగా ఉపయోగపడే పనులు ఏం చేస్తున్నారన్న డౌట్స్ పెరుగుతున్నాయి. గతంలో జరిపిన టూర్స్ వల్ల నగర ప్రజలకు ఏం ఒరిగిందని కూడా అడుగుతున్నారు. జీహెచ్ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉండగా ఇందులో ముగ్గురు చనిపోయారు. ఇద్దరు ఎమ్మెల్యేలయ్యారు. ఇక ప్రస్తుతమున్న 145 మందిని అహ్మదాబాద్, చండీగఢ్ స్టడీ టూర్స్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. ఆధునిక పట్టణ పాలన, మౌలిక వసతులు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలపై అధ్యయనం చేయడమే ఈ పర్యటన లక్ష్యమని కార్పొరేటర్లు చెబుతున్నా... మరో నెల రోజుల్లో పదవీ కాలం పూర్తయ్యే వీళ్ళు ఇప్పుడు అధ్యయనం చేసివచ్చి ఎవర్ని ఉద్ధరిస్తారన్న ప్రశ్నలు వస్తున్నాయి సిటీ జనం నుంచి. అదేదో ఎక్కువ కాలం పదవిలో ఉండే వాళ్ళయితే... అబద్ధమైనా నిజమనుకుని భ్రమపడి నమ్మేయవచ్చుగానీ, నెల రోజుల్లో పదవి నుంచి దిగిపోయేవాళ్ళ వల్ల ఉపయోగం ఏంటన్నది బిగ్ క్వశ్చన్. నిరుడు కొందరు కార్పొరేటర్లు అసోం, ఇండోర్‌కు స్టడీ టూర్ కోసం వెళ్ళి వచ్చారు.

అప్పట్లో ఆ పర్యటన, వ్యయ భారంపై విమర్శలు వచ్చినా,,, ఇప్పుడు మరోసారి అదే పని చేస్తున్నారంటే... వీళ్ళకు అసలు జనం సొమ్మంటే లెక్కే లేదా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈసారి టూర్‌కు కోటి 40 లక్షల రూపాయల దాకా ఖర్చవుతుందన్నది ప్రాథమిక అంచనా. కార్పొరేటర్ల ప్రయాణం, వసతి, భోజనం, లోకల్ ట్రాన్స్ పోర్ట్ వంటి అన్ని ఖర్చులను బల్దియానే భరిస్తుంది. పదవీకాలం చివరి దశలో ఇంత భారీ వ్యయంతో టూర్ అవసరమా అనే ప్రశ్నకు ఏ కార్పొరేటర్ దగ్గరా కచ్చితమైన సమాధానం లేదు. వీళ్ళకు ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు, పర్సనల్ సోకులు ఎక్కువయ్యాయని అంటున్నారు ఎక్కువ మంది. అహ్మదాబాద్ వెళ్లే కార్పొరేటర్లకు ఒక్కొక్కరికి 93వేల 975 రూపాయలు, చండీగఢ్ వెళ్లే వాళ్ళకు ఒక్కొక్కరికి 94వేల 132 రూపాయలు ఖర్చవుతుందంటూ ట్రావెల్ ఏజెన్సీ ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిసింది. వాటిని స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదించారు. అయితే...చండీగఢ్ వెళ్ళేవాళ్ళు అక్కడి నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న కులుమనాలి టూర్‌కు కూడా ప్లాన్ చేస్తున్నట్టు అంతర్గత సమాచారం. నిరుడు ఆగస్ట్‌లో పాలకమండలి సభ్యులు ఇండోర్, అసోం టూర్‌కు వెళ్లారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి నేతృత్వంలో రెండు బృందాలుగా అధ్యయన యాత్రలు జరిగాయి.

అప్పుడు ఒక్కో కార్పొరేటర్‌కు 80 వేల చొప్పున మొత్తం కోటి 16 లక్షలు ఖర్చయ్యాయి. అంత ఖర్చుపెట్టినా.... ఆ పర్యటనల్లో ఏంనేర్చుకున్నారు..? ఆ నేర్చుకున్న వాటిని హైదరాబాద్‌లో ఎక్కడ అమలు చేశారన్నది మాత్రం ఇప్పటికీ బ్రహ్మ పదార్థమే. కనీసం ఆ అధ్యయన యాత్రకు సంబంధించిన నివేదికను కూడా సమర్పించలేదు. అది స్టడీ టూర్‌లా కాకుండా విహార యాత్రలా జరిగిందన్న విమర్శలు కూడా వచ్చాయి. గతంలోనూ కార్పొరేటర్ల పర్యటనలపై లోకాయుక్త అభ్యంతరం తెలిపింది. ప్రజాధనం వృథా తప్ప ప్రయోజనం లేదని పేర్కొంది. ఇన్ని రకాలుగా వ్యతిరేకత ఉన్నా...మరోసారి అధ్యయన యాత్రకు వెళ్ళేందుకు సిద్ధమవుతున్నారంటే జీహెచ్ఎంసీ కార్పొరేటర్స్‌కు జనం సొమ్మంటే లెక్కలేదా? లేక ప్రజల కష్టార్జితంతో షోకులు చేసుకోవడం సరదానా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతి అంశం మీద కొట్లాడే కార్పొరేటర్లు... ఈ స్టడీ టూర్‌కు మాత్రం పార్టీలకు అతీతంగా కలిసి వెళ్తున్నారు. కొసమెరుపు ఏంటంటే... ఒకవేళ ఎవరైనా కార్పొరేటర్‌కు టూర్‌కు వెళ్ళాలని ఆసక్తిలేకపోతే...వారి వాటాకింద లక్ష రూపాయల సొమ్మును వారికే ఇచ్చేస్తారట. అది స్టడీ టూరా, జాలీ టూరా అన్నది ఇక్కడే అర్థమైపోతుందని అంటున్నారు విమర్శకులు.





## పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కఠిన చర్యలు....

- బాల కార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలి....
- ఆపరేషన్ స్మైల్–12 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి...
- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు...

**మెదక్ డిసెంబర్ 30 (ప్రజా స్వరం)**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్-12 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ స్మైల్-12 కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో వివిధ శాఖల సంబంధిత అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రమాదకరమైన ప్రాంతాల్లో పని చేస్తున్న పిల్లలను, తప్పిపోయిన పిల్లలను గుర్తించి రక్షించడం, వారికి పునరావాసం కల్పించడం, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పరిశ్రమలు, వ్యాపార సముదాయాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి, పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన పిల్లలను వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాలని, తల్లిదండ్రులకు అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని, అనాథ పిల్లలను కేర్ హోమ్‌లకు తరలించే ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098 కు సమాచారం ఇవ్వాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ప్రతి ఏటా జనవరి 1 నుండి జనవరి 31 వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అవసరమైన ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మక తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓ జయ చంద్ర రెడ్డి, జిల్లా డీడబ్ల్యూఓ హైమావతి, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉప్పలయ్య, లేబర్ డిపార్ట్‌మెంట్ డీసీపీవో సత్యేంద్ర ప్రసాద్, హెల్త్ డిపార్ట్మెంట్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







# ఘనంగా వైకుంఠ ఏకాదశి..

- ఉత్తర ద్వారం గుండా వెంకటేశ్వరా స్వామిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్..
- వేంకటేశ్వర స్వామి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి.
- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి..

**మెదక్ డిసెంబర్ 30 (ప్రజా స్వరం)**

వేంకటేశ్వర స్వామి కృపతో రాష్ట్ర ప్రజలు అందరు సుభిక్షంగా ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం. పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మెదక్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ కోదండ రామాలయంలో ఉత్తర ద్వారం గుండా స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారి పల్లకి సేవలో భక్తులతో కలిసి పాల్గొని పల్లకి మోశారు. ఈ సందర్భంగా పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది అన్నారు. ప్రజలందరికి వైకుంఠ ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపతో రాష్ట్ర జలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయం, వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు బండ నరేందర్, కంచి మధుసూదన్, మెదక్ మార్కెట్ మాజీ చైర్మన్ కృష్ణ రెడ్డి, మాజీ కౌన్సిలర్ లు ఆర్కె శ్రీనివాస్, వంజరి జయరాజ్ ,మాయ. మల్లేశం, నాయకులు లింగారెడ్డి, మహిపాల్ రెడ్డి, మోహన్ నాయక్, శ్రీను నాయక్ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు



**జవహర్ నగర్, డిసెంబర్ 30, ప్రజాస్వరం:**

వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా బాలాజీ నగర్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునే స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఉత్తర ద్వారా దర్శనం ద్వారా భక్తులను అనుమతించారు. వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా వైష్ణవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటే పుణ్యం లభిస్తుందని ప్రజలు విశ్వసిస్తారు ఎంతో ఉదయ నుంచే స్వామివారికి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కుతాడి శ్రీనివాస్ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు చేపట్టారు. జవహర్ నగర్ సిఐ సైదులు తో పాటు స్థానిక నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఫోటో రైట్ అప్: ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారు 2, స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు



## రుక్మిణి పాండురంగ ఆలయంలో ప్రత్యేక పూజలు

**మాసాయిపేట డిసెంబర్ 31 (ప్రజాస్వరం)**

మండల కేంద్రంలోని శ్రీ రుక్మిణి పాండురంగ ఆలయంలోవైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హరిరంజన్ శర్మ ఆధ్వర్యంలో శ్రీ రుక్మిణి పాండురంగ స్వాములకు అభిషేకాలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని భక్తులు రుక్మిణి పాండురంగ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ రుక్మిణి పాండురంగ ఆలయంలో ఆధ్యాత్మిక శోభ కనిపించింది.



## ఉత్తర ద్వారము ద్వారా స్వామి వారిని దర్శించుకున్న మాజీ జడ్పి చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్

**తూప్రాన్ (ప్రజాస్వరం) :**

వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని జడ్పి చైర్పర్సన్ హేమలత శేఖర్ గౌడ్ ఉత్తర ద్వారము ద్వారా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారం గుండా స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది అన్నారు. ప్రజలందరికి వైకుంఠ ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కృపతో జిల్లా , మండల , రాష్ట్ర జలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.






## బాధిత కుటుంబానికి చేయూత...

**మెదక్ డిసెంబర్ 30 (ప్రజా స్వరం)**



షార్ట్ సర్క్యూట్ కారణం గా హవేలీ ఘనపూర్ మండలం పోచంరల్ గ్రామం లో వడ్డే నాగమణి ఇల్లు కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న యంగ్ స్టార్స్ ఫౌండేషన్ పౌండర్ రాగి వనజ వారి సభ్యులతో నిత్య అవసర వస్తువులు, దుస్తులు, బ్లాంకెట్స్, ఇతర వస్తువులు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వారణాసి సౌమ్య, సంతోష్, గోవిందరాజులు, సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నగర్ లో మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ పర్యటన

**జవహర్ నగర్, డిసెంబర్ 30: ప్రజాస్వరం:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఆదేశానుసారం ఈనెల 29 నుండి 31 స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా మంగళవారం మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వాన్ జవహర్ నగర్ పరిధిలో పర్యటించి శానిటేషన్ పనుల నిర్వహణ డంపింగ్ యార్డ్ ,పవర్ ప్లాంట్ ను సందర్శించి పని తీరు తదితర వివరాలను అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కీసర సర్కిల్ డిప్యూటి కమీషనర్ ఎన్ వసంత ,అధికారులు పాల్గొన్నారు.

ఫోటో రైట్ అప్: డంపింగ్ యార్డ్ ను పరిశీలిస్తున్న మల్కాజ్గిరి జోనల్ కమిషనర్



## నట్టల నివారణ మందు సద్వినియోగం చేసుకోవాలి.. సుధాకర్ దేశ్ ముఖ్

**నార్సింగి డిసెంబర్ 30 (ప్రజా స్వరం)**

ప్రభుత్వం ఉచితంగా అందించే నట్టల మందుతో సన్న జీవాలలో ఆరోగ్య పరిపుష్టి లభిస్తోందని మండల పశు వైద్యాధికారి సుధాకర్ దేశముఖ్ అన్నారు. మండల పరిధి లోని శేరిపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని మండల పశు వైద్యాధికారి శేరిపల్లి గ్రామ సర్పంచ్ సంతోష గోండా స్వామి యాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ ఉచిత నట్టల ముందు పంపిణీ కార్యక్రమం మండల వ్యాప్తంగా వివిధ తేదీలలో నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా శేరిపల్లి లో నేడు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ 31 న వల్లభాపూర్, కాసులాపూర్ లో జనవరి 1 నాడు నిర్వహిస్తామని తెలిపారు. సన్న జీవాల( గొర్రెలు, మేకలు) రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంగళవారం శేరిపల్లి లో నిర్వహించిన కార్యక్రమం లో 514 గొర్రెలకు, 441 మేకలకు నట్టల ముందు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ విజయ్ కుమార్, ఎల్.ఎస్.ఏ శ్రీనివాస్, గోపాల మిత్ర ఫజల్, ఓ.ఎస్ స్వామి, వార్డు సభ్యులు నవీన్ కుమార్, శ్రీనివాస్, మురళి, మల్లేశం, రైతులు కిష్టయ్య యాదవ్, నవీన్, రమేష్, ప్రవీణ్, మల్లేశం, నరసింహులు, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి వారిని భారీ సంఖ్యలో దర్శించుకున్న భక్తులు

**మేడ్చల్, ప్రజాస్వరం:**

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం తెల్లవారుజామునుంచే శ్రీశ్రీశ్రీ క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించామని ఆలయ పండితులు తెలిపారు. ఎల్లంపేట మున్సిపాలిటీ ఘనపూర్ గుట్టపైన ఉన్నటువంటి క్షేత్రగిరి వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు వైకుంఠ ఏకాదశి పర్వదినాన భారీ సంఖ్యలో పోటెత్తి ఉత్తర ద్వారం నుండి భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు స్వామి వారికి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదలను ఆలయ పండితులు అందజేశారు. వచ్చే జనవరి నెలలో సంక్రాంతి మరసటి రోజు కనుమ దినాన జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరిగిరావాలని ఆలయ ఈవో బాకరాజు దివాకర్ కోరారు. కార్యక్రమంలో పండితులు వెంకన్న, గణపతి, శివశర్మ పాల్గొన్నారు.









## చిన్నమాసాన్‌పల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

- **సర్పంచ్ రేకుల నర్సింహారెడ్డి**

**దౌల్తాబాద్ డిసెంబర్ 30( ప్రజాస్వరం)**

గ్రామంలో నెలకొన్న తీవ్ర తాగునీటి కొరతను తక్షణమే పరిష్కరించాలని చిన్నమాసాన్‌పల్లి గ్రామ సర్పంచ్ రేకుల నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మిషన్ భగీరథ ఏఈఈ అభినయ్‌తో కలిసి గ్రామంలో ఉన్న నీటి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదని, దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు అందుతుంటే తమ గ్రామానికి ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెండు సంవత్సరాల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించినప్పటికీ ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వకపోవడం వల్ల ప్రయోజనం లేకుండా పోయిందని గుర్తు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చిన్నమాసాన్‌పల్లిలో మిషన్ భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, సంబంధిత శాఖ అధికారులు సహకరిస్తే గ్రామస్తులతో కలిసి సమస్య పరిష్కారానికి భాగస్వాములమై కృషి చేస్తామని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామంలో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లావణ్య, మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## అక్రిడేషన్ కార్డుల జీవో 252 ను సవరించాలి....

- **రెండు కార్డుల విధానం గూర్చి అసెంబ్లీ లో చర్చించండి.**
- **అక్రిడిటేషన్ కార్డుల పేరుతో జర్నలిస్టులను విడగొట్ట వద్దు**
- **ఎమ్మెల్సీ యాదవ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టియుడబ్ల్యూజే హెచ్ 143 సభ్యులు...**

**గజ్వేల్ డిసెంబర్ 30 ప్రజాస్వరం**

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 252 ను సవరించాలని టియుడబ్ల్యూ జే (H 143)డిమాండ్ చేసింది. అసెంబ్లీ సమావేశాలు నడుస్తూ నేపథ్యం లో జర్నలిస్టుల అక్రెడిటేషన్ ల విషయం పై 252 జీవో సవరణ చేసే విషయాన్ని అసెంబ్లీ లో లేవనెత్తాలని ఉమ్మడి మెదక్ జిల్లా శాసన మండలి సభ్యుడు యాదవ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షులు గరిదాస్ నవీన్ కుమార్, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు కనీస హక్కుగా ఇచ్చే అక్రిడిటేషన్ కార్డులను భారీ స్థాయిలో తగ్గిస్తూ, డెస్క్ జర్నలిస్టులకు వేరుగా బ్యూరో జర్నలిస్టులకు వేరుగా రెండు కార్డుల విధానాన్ని తీసుకువచ్చి జర్నలిస్టుల మధ్య విభజన రేఖలు ఇస్తున్న 252 జీవోను వెంటనే సవరించాలని అన్నారు. గతంలో ఉన్న 239 జీవో ఆధారంగా 23 వేల కార్డులు రాగా నూతనంగా తీసుకొచ్చిన జీవోతో 13 వేల కార్డులు తగ్గనున్నాయని నూతనంగా వచ్చిన ఈ జీవోను బట్టి తెలుస్తుందనీ, ఇలా జరిగితే జర్నలిస్టులకు తీరని అన్యాయం ఈ ప్రభుత్వం చేసినట్లు అవుతుందన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై మీరు సభలో చర్చించి ప్రభుత్వానికి మీ ద్వారా తగు సూచన చేసి జీఓ సవరణ విషయంలో జర్నలిస్టు సమాజానికి మద్దతుగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సభ్యులు కరుణాకర్, ఆభోద్దీన్, రాజు, ప్రవీణ్, మల్లేశం, ఖాదర్ పాషా, మురళి, గణేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులు సహించం

- **దోషులను వెంటనే అరెస్ట్ చేయాలి**
- **ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అయ్యగల్ల రవి మాదిగ**

**దౌల్తాబాద్ డిసెంబర్ 30( ప్రజాస్వరం )**

మండలంలోని అనాజీపూర్ గ్రామంలో ఇటీవల దళిత కుటుంబంపై జరిగిన దాడికి ఎమ్మార్పీఎస్ రాయపోల్ మండల అధ్యక్షులు అయ్యగల్ల రవి మాదిగ తీవ్రంగా స్పందించారు. మంగళవారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, దాడి ఘటనపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా, ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఓటమి పాలైన దళిత వర్గానికి చెందిన పారునంది యాదగిరిపై దాడి జరిగిన విషయాన్ని పరిశీలించారు. అయ్యగల్ల రవి మాదిగ మాట్లాడుతూ, దాడి చేసినవారిని తక్షణమే అరెస్ట్ చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, బాధితుడికి చట్టపరమైన రక్షణ కల్పించకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు బందారం సంతోష్, కోశాధికారి కొనింటి లక్ష్మణ్, ప్రచార కార్యదర్శి కొనింటి రాజు, నాయకులు పరశరాములు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## దారికి అడ్డంగా ఉన్న మొక్కలు తొలగింపు



- **మార్కెట్ వైస్ చైర్మన్ మద్దెల స్వామి**

**దౌల్తాబాద్ డిసెంబర్ 30( ప్రజాస్వరం)**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో వద్ద బస్ రాకుండా ఉన్న రహదారి సమస్య స్థానిక ప్రజలకు పెద్ద ఇబ్బందిగా మారింది. ప్రయాణీకులు బస్సుల కోసం ఎదురు చూస్తూ తీవ్ర అసౌకర్యం ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ సమస్యను గమనించిన మార్కెట్ వైస్ చైర్మన్ మద్దెల స్వామి వెంటనే స్పందించారు. స్వామి మాట్లాడుతూ ప్రజల సమస్యలను నాయకులు వాయిదా వేయకుండా, వెంటనే పరిష్కరించడం ముఖ్యము. రహదారులు సురక్షితం, సులభంగా ప్రయాణం జరుగుతుందో లేదో కంటిన్యూ పరిశీలించాలి అని తెలిపారు. ఆయన నేతృత్వంలో బస్ రహదారిని ఆవరించిన పొదలు, చెట్లు తొలగించబడినాయి. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు వార్డ్ సభ్యులు కూడా సానుభూతిగా పాల్గొన్నారు. వీరిలో దుర్గని మధుసూదన్, మద్దెల మల్లేష్, నల్ల నరేష్, కరే మహేష్, మహిపాల్ రెడ్డి చక్రం తదితరులు ఉండగా, సమష్టిగా పని చేసి రహదారిని సాధారణ సదుపాయానికి అందించారు.



## మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం...

**మెదక్ డిసెంబర్ 30 (ప్రజా స్వరం)**

మత్స్యకారుల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని బూరుగుపల్లి సర్పంచ్ చిన్న సాయిలు పేర్కొన్నారు. మంగళవారం హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలోని పెద్ద చెరువు, శ్రీపతి చెరువు ల్లో లక్ష 15 వేల ఉచిత చేప పిల్లలను మత్స్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో సర్పంచ్ చిన్న సాయిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందినందుకే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని అన్నారు. చేపలను వారే అమ్ముకొని ఆర్థికంగా అభివృద్ధి చెందినందుకు ప్రభుత్వం సహాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ నాగరాజు, గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు, బెస్త సంఘం సభ్యులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.





## తూప్రాన్ డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ శ్రీనివాస్ రావు

**తూప్రాన్ (ప్రజాస్వరం) :**

మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తూప్రాన్ డీఎస్పీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహణ విధానాలు, కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి తదితర అంశాలకు సంబంధించిన అన్ని రిజిస్టర్లను సవివరంగా పరిశీలించారు. నేరాల నియంత్రణలో మరింత చురుకైన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పునరావృత నేరాలపై కఠినంగా వ్యవహరించాలని తూప్రాన్ డీఎస్పీకి ఆదేశాలు జారీ చేశారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయాలని తెలిపారు. ఆస్తి సంబంధిత నేరాలు, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి ఘటనలను అరికట్టేందుకు డివిజన్ మరియు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతే పోలీసు శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.



# చిన్న శంకరంపేట పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి రికార్డును పరిశీలించిన ఎస్పీ శ్రీనివాసరావు...

**చిన్న శంకరంపేట డిసెంబర్ 30 (ప్రజాస్వరం)**

నూతన సంవత్సర వేడుకలు సురక్షితంగా జరుపుకోవాలనీ నిబంధనలుఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవనిజిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, సీసీ కెమెరాలతో చట్ట వ్యతిరేక చర్యలపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, అన్నారు, చిన్న శంకరం పేట మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు పలు రికార్డులను తనిఖీ చేశారు, ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పోలీస్ స్టేషన్లో రికార్డులను పరిశీలించడం జరుగుతుందని కేసుల వివరాలను తెలుసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సురక్షితంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, సూచించారు. ప్రమాదాలకు దూరంగా ఉండేందుకు పిల్లలు, పెద్దలు కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇండ్లలోనే వేడుకలు జరుపుకోవాలని, పోలీసు శాఖ జారీ చేసిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచే జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తుందని తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని పేర్కొన్నారు. ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా చట్ట వ్యతిరేక చర్యలను గుర్తించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డిసెంబర్ 31 రాత్రి ఎలాంటి ఆర్గనైజ్డ్ వేడుకలకు మద్యం మత్తులో వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేయడం వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మైనర్లకు మద్యం విక్రయించడం నేరమని తెలిపారు. రహదారులు బ్లాక్ చేయడం, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రైవేట్ మరియు



ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించడం, వీధి దీపాలు ధ్వంసం చేయడం, నిషేధిత డ్రగ్స్, గంజా వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం జరిగితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయాల్లోనే మూసివేయాలని, బహిరంగ ప్రదేశాలు మరియు ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఏ కార్యక్రమం నిర్వహిం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ స్పష్టం చేస్తూ, అత్యవసర పరిస్థితుల్లో స్థానిక పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ రామాయంపేట సిఐ వెంకటరాజా గౌడ్ ఎస్సై నారాయణ గౌడ్ ఎస్ బి సి ఐ సందీప్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# చేగుంటలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

- **ఉత్తర ద్వారం ద్వారా అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు**

**చేగుంట డిసెంబర్ 30 ( ప్రజాస్వరం )**

చేగుంట మండల కేంద్రం లోని శ్రీ గోదాదేవి పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరా స్వామి ఆలయం లో నేడు వైకుంఠ ఏకాదశి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు . ఆలయ కమిటీ ఆలయమును పూలమాలలతో సర్వంగా సుందరంగా అలంకరించారు. ఈ వేడుకలకు భక్తులు ఉదయం ఐదు గంటల నుండి అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు . భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశారు ఆలయ పూజారి వాసుదేవ శర్మ భక్తుల కొరకు ప్రత్యేక పూజలు నిర్వహించ స్వామి వారి దర్శనానికి చేగుంట గ్రామ ప్రజలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నాని. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని స్థానిక సర్పంచ్ స్రవంతి సతీష్ తహశీల్దార్ శివప్రసాద్ ఊరు విడిచి వెళ్లొద్దు సినిమా నటీనటులు సింధు, వంశీధర్ వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆయుత పరంజ్యోతి లు స్వామివారిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఉత్సవాలకు సహకరించిన దాతలను ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు, ఆలయ పూజారి వాసుదేవ శర్మ మాట్లాడుతూ, వైకుంఠ ఏకాదశి హిందూ ధర్మంలో అత్యంత పవిత్రమైన ఏకాదశుల్లో ఒకటని. ఈ రోజు శ్రీ మహావిష్ణువు నిద్ర నుంచి మేల్కొంటారని, వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటాయని భక్తుల విశ్వాసం. ఈ రోజు ఉత్తర ద్వార దర్శనం, స్వర్ణరథోత్సవం ఉంటుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని, వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తెల్లవారుజామునే వేచి ఉంటారు అని వైకుంఠ ఏకాదశి రోజున మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడని పురాణ కథనం అని తెలిపారు. అలాగే ఈ రోజు ఉపవాసం, పూజ, జాగరణ చేస్తే మోక్షం, పాప విమోచనం పొంది వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం అని అన్నారు.



# శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

**దౌల్తాబాద్, డిసెంబర్ 30 (ప్రజాస్వరం):**

ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో భక్తుల ఊరటతో ఉత్సవాలు జరిపి ఆనంద వాతావరణం నెలకొంది. భక్తులు ఆలయ ఉత్తర ద్వారం నుండి ప్రవేశించి స్వామివారి ఉత్సవ విగ్రహాలను దర్శించుకున్నారు. అనంతరం, స్వామివారి విగ్రహాలను ప్రధాన వీధులలో పల్లకి ద్వారా ఊరేగింపు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయబడింది. ముక్కోటి ఏకాదశి ఈ రోజు విశిష్ట పుణ్య దినంగా భావించబడుతుంది. భక్తులు ఉపవాసం చేసి, పుణ్యకర్మలు నిర్వర్తించడం ద్వారా ఆరోగ్యం, ధన, శాంతి మరియు కుటుంబ సంకల్పాల కోసం దివ్య ఆశీస్సులు పొందుతారు. ఆలయ అధికారులు భక్తులకు ముక్కోటి ఏకాదశి ప్రాముఖ్యతను వివరించి, సమగ్ర ఆధ్యాత్మిక మార్గదర్శకాలను అందించారు.



# కేజీబీవీ విద్యార్థులకు క్రీడా సామాగ్రి విరాళం

- **చదువు, ఆటలలో సమతుల్యం అవసరం ఎస్ఓ సుగంధ లత**

**దౌల్తాబాద్ డిసెంబర్ 30( ప్రజాస్వరం)**

విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని రాయపోల్ మండల కేజీబీవీ ఎస్ఓ సుగంధ లత అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రం కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, వాలీబాల్ పోల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా నిబద్ధత చూపాలి, శారీరకంగా మరియు మానసికంగా దృఢంగా ఉండాలి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజు వ్యాయామం చేయాలని సుగంధ లత సూచించారు. విద్యార్థులకు వాలీబాల్ సామాగ్రి అందజేస్తున్న క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు విజయరేఖ, సభ్యులు గోవర్ధన్ రెడ్డి, నవీన్, నరేష్ కుమార్, పాఠశాల పిఈటి మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు చదువులోనూ, ఆటల్లోనూ మంచి ప్రదర్శన కనబరుస్తే, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరే అవకాశాలు పెరుగుతాయని సుగంధ లత తెలిపారు.



# ప్రమాదవశాత్తు రెండు నివాస పూరి గుడిసెలు దగ్ధం భారీగా నష్టం...



**చిన్న శంకరంపేట డిసెంబర్ 30( ప్రజాస్వరం )**

చిన్న శంకరంపేట మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో రెండు నివాస పూరి గుడిసెలు అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. చింతకింది నర్సమ్మ ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో లక్ష రూపాయల నగదు, 2 క్వింటాళ్ల బియ్యం, వస్త్రాలు, నిత్యావసర సరుకులు పూర్తిగా దగ్ధం కావడంతో ఆ కుటుంబం కట్టుబట్టలతో బయటపడింది. చింతకింది శంకర్ చెందిన నివాస కురిసే దగ్ధం కావడంతో రెండు లక్షల యాభై వేల రూపాయల నగదు, 5 తులాల బంగారం , 80 తులాల వెండితో పాటు వస్త్రాలు, నిత్యావసర సరుకులు పూర్తిగా కోల్పోయారు. ఈ ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఈ రెండు కుటుంబాలను ప్రభుత్వం స్పందించి వెంటనే ఆదుకోవాలని మాజీ ఎంపిటిసి నాగరాజు కోరారు. మెదక్ రామయంపేట ఫైర్ సిబ్బంది అగ్నిమాపక వాహనాలతో మంటలను చల్లారిచారు.





# డిసెంబర్ 31 వేడుకల్లో అప్రమత్తంగా ఉండండి

- **దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్**

**దౌల్తాబాద్, డిసెంబర్ 30( ప్రజా స్వరం ):**

కొత్త సంవత్సర వేడుకలు జరగనున్న సందర్భంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ సూచించారు. డిసెంబర్ 31 న ప్రజలు ఎక్కువగా సమూహాలుగా కూడే అవకాశం ఉంది. ఈ వేళల్లో వ్యక్తిగత భద్రతకు ముఖ్యమైనది జాగ్రత్తగా ఉండటం. రహదారి నిబంధనలు, వ్యక్తిగత సురక్షత నియమాలను పాటించడం అవసరం. అజాగ్రత్త వల్ల అనార్థాలు జరుగే అవకాశం ఉంది అని ఆయన సూచించారు.



# తూప్రాన్ లో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు...

- **ఉత్తర ద్వారా నరసింహ క్షేత్రాన్ని దర్శించిన భక్తులు..**

**తూప్రాన్ (ప్రజాస్వరం) :**

తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని రామాలయం సమీపంలో అతి పురాతనమైన ఉత్తర ద్వారా శ్రీ కూర్మనాలసింహస్వామి దేవాలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు ఉదయం నుంచి నరసింహ స్వామికి అభిషేకం, ధ్వజారోహణము విష్ణు సహస్రనామ పారాయణ మరియు అభిషేకాలు నిర్వహించారు..పురోహితులు అహోబిలం ప్రవీణ్ అహోబిలం హరిప్రసాద్ యాదగిరి స్వామి నిర్వాహకులు కంటయపాలెం వేణుగోపాల్, శ్రీ చూర్ణం విద్యాసాగర్, పేర్ల మధుసూదన్, డాక్టర్ ప్రదీప్ సింహ, శ్రీధర్, సురేష్ రాము తదితరులు పాల్గొన్నారు.. దర్శించుకున్న ప్రముఖులు తూప్రాన్ ఎస్సై యాదగిరి మాజీ కౌన్సిలర్లు మామిడి వెంకటేష్, శ్రీశైలం గౌడ్, పల్లెర్ల బాలేష్ గుప్తా, గడప దేవేందర్, కమ్మరి శ్రీధర్, మాలే సంతోష్ గుప్తా, చితిమిళ్ల అనిల్ కుమార్, సుభాష్ రెడ్డి, బిజెపి నాయకులు తాటి విట్టల్ మహేష్ గౌడ్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999